

కరీంనగర్ జిల్లా వీణవంకలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాల్గొన్న హుజూరాబాద్ నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ప్రజలు

# ఇది మర్లవడుతున్నతెలంగాణ

## ఐదు నెలల్లోనే రాష్ట్రాన్ని ఆగం చేసిండ్రు

**తెలంగాణ ఉద్యమం ఇంకా మిగిలే ఉంది • పునర్నిర్మాణ ప్రక్రియ మనమే చేయాలె**

**ఎన్నికలు ఎప్పుడొచ్చినా మనదే గెలుపు • వీణవంక ఆత్మీయ సమ్మేళనంలో కేసీఆర్**

కరీంనగర్, మే 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): తెలంగాణ ఉద్యమం అయిపోలేదని, పునర్నిర్మాణ ప్రక్రియ ఇంకా ముందున్నదని, మన బాధ్యత అయిపోలేదని బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేశారు. ఇంత జల్దీగా ప్రజల నుంచి వ్యతిరేకత రావడం చూస్తేనే కాంగ్రెస్ సంగతి తెలిసిపోతున్నదని, ఇప్పుడు మళ్లీ తెలంగాణ మర్లవడ్డదని పేర్కొన్నారు. తెలంగాణకు మనం ఇంకా పనిచేసే బాకీ ఉన్నదని తెలిపారు. ఇప్పుడున్న పరిపాలకులకు రాష్ట్రాన్ని కాపాడాలనే ఆకాంక్ష లేదని, మళ్లీ బాగుచేయాల్సిన బాధ్యత మనదేనని శ్రేణులకు సూచించారు. ఆదివారం వీణవంకలోని హుజూరాబాద్ నియోజకవర్గ ప్రజలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కేసీఆర్ ఉద్వేగభరితంగా మాట్లాడారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలన, ఇప్పుడు కాంగ్రెస్ ఐదు నెలల పాలన గురించి కండ్లకుగట్టారు. అదే సమయంలో ఎంపీగా వినోద్‌కుమార్‌ను గెలిపించుకోవడం ఎంత అవసరమో పూసగుచ్చినట్టు వివరించారు. వీణవంకలో కేసీఆర్ వేదికపైకి రాగానే 'సీఎం కేసీఆర్' అనే నినాదాలు మార్మోగాయి. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఎంత సముదాయించినప్పటికీ ఆగకపోగా, చివరికి పిడికిలి బిగించి పార్టీ శ్రేణులు 'జై కేసీఆర్' 'జై తెలంగాణ.. కారు గుర్తుకే మన ఓటు' అని నినదించారు. ఒక దశలో అధినేత కేసీఆర్ జోక్యం చేసుకొని సముదాయించడంతో నినాదాలు ఆపివేశారు. సమావేశంలో ఒకవైపు ఛలోక్తులతో నవ్విస్తూనే, మరోవైపు తెలంగాణకు పొంచి ఉన్న ప్రమాదాన్ని వివరిస్తూ ఆకట్టుకున్నారు. 'అనుకోకుండా కొన్ని సందర్భాలు వస్తయి. పోయిన ఎన్నికల్లో మనం ఓడిపోయినం. అందులో పెద్ద బ్రహ్మ రహస్యం ఏమీ లేదు. చాలా సింపుల్ మాట' అని చెప్పినప్పుడు సభ ఒక్కసారిగా సైలెంట్ కాగా, మళ్లీ తనదైన శైలిలో ఛలోక్తులు విసిరారు. 'మనోళ్లకు ఓ అలవాటు ఉంటది కదా! జర మంచిగా కాగానే ఉబ్బడం, జరంత ఎటమటం కాగానే తగ్గడం. ఇదంతా తెలంగాణోళ్లకు అలవాటే' అంటూ నవ్వించారు. 'ఇగ నీళ్లొచ్చినయి. రైతుబంధువొచ్చింది. 24 గంటల కరెంటొచ్చింది. అన్ని అయిపోయినయి కదా! ఇప్పుడు వాడేమో ఎక్కువ ఇస్తడనుకొని ఆశకు పోయిన్రు. మనం మరింత మంచిగ జేద్దాం అనుకున్నం. కానీ, దురాశకు పోయి నమ్మితే ఏమి జరిగిందో అర్థమవుతుంది కదా' అని చెప్పుకొచ్చారు. ఇదే సమయంలో ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను ఎంపీలుగా గెలిపించాల్సిన ఆవశ్యకతను వివరించారు. 'నేను చెప్పిదంతా వెళ్లి ప్రజలకు వివరించి మన అభ్యర్థుల గెలుపు కోసం కష్టపడాలి' అని పిలుపునిచ్చినప్పుడు.. 'గెలిపించుకుంటా'మంటూ నినాదాలు చేశారు. 'నేను మీ అందరికి మాట ఇస్తున్న. ఒక రోజు హుజూరాబాద్‌కే వచ్చి 24 గంటలుంట. అప్పుడు నాలుగు వందల ఫొటోలు కాదు, నాలుగు వేల ఫొటోలైనా సరే తీసుకుందాం' అంటూ నవ్వుతూ చెప్పడంతో మళ్లీ 'మా సీఎం మీరే'నంటూ నినాదాలు చేశారు. సభ ముగిసిన అనంతరం పాడి కౌశిక్‌రెడ్డి ఇంటి నుంచి వీణవంక బస్‌స్టేషన్ వరకు రోడ్‌షో నిర్వహించారు.. మహిళల మంగళ హారతులు, సంప్రదాయ నృత్యాలు, డప్పుచప్పుళ్ల మధ్య కేసీఆర్ ముందుకు కదిలారు. బస్సులోంచి ప్రజలకు కేసీఆర్ అభివాదం చేశారు.

### రేవంత్ మౌనానికి కారణమేంటి?

మీ గోదావరిని తీసుకెళ్లి తమిళనాడు, కర్ణాటకకు ఇస్తా అని నరేంద్ర మోదీ బాజాప్తా చెప్తున్నడు. ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి ప్రపోజల్ పంపించిండు. సీఎం దీనిపై కిక్కురు మనడం లేదు. నేడు అడుగుతున్నా. అందులో ఏం మతలబ్ దాగి ఉన్నది? మౌనానికి కారణమేంటి? ఉన్న గోదావరి పరాయి పాలైతే మన బతుకు ఏమి కావాలి? గోదావరి పోతే మనకు తాగు, సాగునీళ్లు ఎక్కడి నుంచి వస్తయి? మన బతుకు ఏమి కావాలి? ఇంత ప్రధానమైన విషయంపై సీఎం ఎందుకు మాట్లాడుతలేడు? అదే నేను సీఎం ఉన్నప్పుడు మోదీ ప్రపోజల్ పెడితే ముందు నా తెలంగాణ వాటా లెక్క తేల్చు, ఆ నీళ్లు అక్కడ పెట్టు, అప్పుడు మాత్రమే నేను దీనిపై మాట్లాడుతా అని చెప్పిన. అప్పటి దాకా నీవు ఎన్ని మీటింగ్‌లు పెట్టినా నేను రానని స్పష్టంగా చెప్పిన. దీంతో ఆనాడు ఆ ప్రతిపాదన ఆగిపోయింది. ఇప్పుడు ఇక్కడ ఒక నిరర్థక ప్రభుత్వం ఉందన్న ఉద్దేశంతో మోదీ వాళ్ల ప్రభుత్వం ఇష్టం వచ్చినట్టు ఆడుతున్నది. అందుకే నేను చెబుతున్న. పార్లమెంట్ ఎన్నికల్లో (బీఆర్ఎస్) మనోళ్లే 13 నుంచి 14 మంది ఎంపీలు ఉంటే ఇటువంటి ప్రతిపాదన వస్తే లేసి ఎగిరి గొంతు అందుకుంటరు. నువ్వు ఎట్లా తీసుకుపోతావు బిడ్డా అని ప్రశ్నిస్తరు. ప్రస్తుతం ఇక్కడ లేం. ఇక్కడ లేనప్పుడు అక్కడ కూడా లేకపోతే ఎలా? ఇక్కడ లేక, అక్కడ లేక ఆగమైపోతే ఎవరు కాపాడాలి? ఎట్టి పరిస్థితుల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలి.

**- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్**



కరీంనగర్ జిల్లా వీణవంకలో జరిగిన హుజూరాబాద్ నియోజకవర్గ ప్రజల ఆత్మీయ సమ్మేళనంలో ప్రసంగిస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. చిత్రంలో బీఆర్ఎస్ లోక్‌సభ అభ్యర్థి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి, జడ్పీ చైర్‌పర్సన్ కనమల్ల విజయ, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

### మళ్లీ వచ్చేది మన ప్రభుత్వమే

"మీ అందరినీ ఒకటే కోరుతున్నా. ఇంత జల్దీ అంటే కేవలం నాలుగైదు నెలల్లోనే ప్రజల నుంచి ఇంత వ్యతిరేకత ఎదుర్కొంటున్న ఈ ప్రభుత్వం కొనసముట్టేది కాదు. రెండోది వందశాతం చెబుతున్నా.. నా మాట మీద విశ్వాసం ఉంచండి. రాష్ట్రంలో అసెంబ్లీ ఎలక్షన్స్ ఎప్పుడు వచ్చినా అవి మధ్యలో వచ్చినా లేదా, కొసకొచ్చినా మళ్లీ మన ప్రభుత్వమే వస్తుంది. అందులో ఎవరికీ ఎటువంటి అనుమానాలు అవసరం లేదు.

**- కేసీఆర్**

### గెలిచినా, ఓడినా ప్రజల కోసం పనిచేయాలి

"ఇది టెంపరరీ సెట్‌బ్యాక్ మాత్రమే. రాజకీయాల్లో ఉన్న వాళ్లకు నిబ్బరం ఉండాలి. మేం గెలిస్తేనే లెక్క, లేకపోతే లేదు అని ఎప్పుడూ అనుకోవద్దు. ప్రజల కోసం పనిచేయాలి. ప్రజల జీవితంలో ఉండాలి అనుకునే వాళ్లు గెలిచినా ఓడినా ప్రజల కోసం పనిచేస్తూనే ఉండాలి. దటీజ్ పాలిటిక్స్. రాజకీయంలో ఒకసారి ఓడుతం. మరోసారి గెలుస్తం. అది పెద్ద సమస్య కాదు. నేనిప్పుడు చాలా గ్రామాలు, ప్రాంతాలు తిరిగి వచ్చిన తర్వాత చెబుతున్న. కాంగ్రెస్ ప్రభుత్వం సంగతి తెలిసిపోయింది కదా. అందుకే తెలంగాణ మళ్లీ ఇప్పుడు మర్లవడ్డది.

**- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్**



జగిత్యాలలోని ఎమ్మెల్సీ ఎల్ రమణ ఇంటికి వచ్చిన కేసీఆర్‌కు బొట్టుపెట్టి స్వాగతం పలుకుతున్న రమణ సతీమణి

# ఎస్సీ వర్గకరణ కోసం పోరాడుతాం

- **దళితజనోద్ధరణ బీఆర్ఎస్ జీవన విధానం**
- **ఎస్సీ వర్గీకరణపై బీజేపీకి చిత్తశుద్ధి లేదు**
- **మాదిగల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన కాంగ్రెస్**
- **తనను కలిసిన ఎమ్మార్పీఎస్ నేతలతో హరీశ్‌రావు**
- **మాదిగల మద్దతు బీఆర్ఎస్‌కే: వంగపల్లి శ్రీనివాస్**

హైదరాబాద్, మే 5 (నమస్తే తెలంగాణ)/చిక్కడపల్లి: దళిత జనోద్ధరణకు చిత్తశుద్ధితో పాటుపడిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణతోనే మాదిగ సామాజిక వర్గం అన్ని రంగాల్లో రాణిస్తుందనే దృఢమైన ఆలోచన ఉన్నది బీఆర్ఎస్ పార్టీకేనని, అందులో భాగంగానే రెండుసార్లు అసెంబ్లీ తీర్మానం చేశామని తెలిపారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు స్వయంగా ప్రధాని మోదీని కలిసి వర్గీకరణ బిల్లుకు ఆమోదం తెలపాలని కోరామని ఉదహరించారు. ఆదివారం హైదరాబాద్‌లోని హరీశ్‌రావు నివాసంలో తెలంగాణ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్, పలువురు సంఘం నాయకులు ఆయనతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గకరణ అంశం ఇతర రాజకీయ పార్టీలకు ఎన్నికల సమయంలోనే గుర్తుకొస్తుందని, బీఆర్ఎస్‌కు మాత్రం జీవన విధానంగా మారిందని వివరించారు. జాతీయ స్థాయిలో ఈ అంశం తేలకపోతే, రాష్ట్ర పరిధిలోనైనా వర్గీకరణ చేసుకొనే అవకాశం కల్పించాలని కేంద్రాన్ని కోరామని గుర్తుచేశారు. కేంద్రం ఆ వెసులుబాటు కల్పించి ఉంటే ఇప్పటికే వర్గీకరణ మన రాష్ట్రంలో అమలవుతూ ఉండేదని చెప్పారు. ఎస్సీ వర్గీకరణపై వెనుకడుగు వేయబోమని, అసెంబ్లీలో, పార్లమెంట్‌లో గట్టిగా పోరాటం చేస్తామని అభయమిచ్చారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలమని బీజేపీ పేర్కొన్నా, ఆ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో చేర్చలేదని, పదేండ్లు అధికారంలో ఉన్నా బిల్లుపై ఊసెత్తలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. మాదిగలతో పాటు అన్ని సామాజికవర్గాలను గత పదేండ్లుగా బీజేపీ వాడుకున్నదని, ఆ పార్టీకి మాదిగల ఓట్లు అడిగే నైతికహక్కే లేదని మండిపడ్డారు. దళితుల్లో అత్యధికంగా ఉన్న మాదిగ సామాజికవర్గానికి కనీసం ఒక్క ఎంపీ సీటు కూడా ఇవ్వకుండా మాదిగ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

### బీఆర్ఎస్ గెలుపుతోనే దళితులకు మేలు: వంగపల్లి

దళితవర్గాల ప్రయోజనమే తెలంగాణ ప్రయోజనంగా భావించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మొదటి నుంచి దళిత వర్గాలకు అన్ని రకాలుగా అండదండలు అందించారని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో మాదిగ సామాజిక వర్గం తీరని వేదనకు గురవుతున్నదని చెప్పారు. ఈ నేపథ్యంలో పార్లమెంట్ ఎన్నికల్లో తామంతా బీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వాలని నిర్ణయించామని తెలిపారు. మాదిగల ఆత్మగౌరవాన్ని హేళన చేస్తున్న కాంగ్రెస్, బీజేపీలకు తగిన బుద్ధిచెప్తామని హెచ్చరించారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు, వివిధ జిల్లాల అధ్యక్షులు పుట్టపింజర రమేశ్, బంగారు శ్రీనివాస్, వేణుగోపాల్, కృష్ణ, సీహెచ్ గణేశ్, ఈదునూరి యాకయ్య, రాజేశ్‌ఖన్నా, నందిగామ నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

# అబద్ధాల రాహుల్ క్షమాపణ చెప్పు



సిద్దిపేటలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడుతున్న హరీశ్‌రావు

- **ఆరు గ్యారెంటీలపై నిర్మల్ సభలో పచ్చి అబద్ధాలు**
- **మహిళల ఖాతాల్లో 2,500 ఎక్కడ పడ్డాయ్?**
- **కాంగ్రెస్ నేతలను మహిళలు నిలదీయాలి**
- **కాంగ్రెస్ అమలు చేసింది ఒకే ఒక్క గ్యారెంటీ**
- **ఎక్కడైనా బహిరంగ చర్చకు సిద్ధం**
- **రాహుల్‌గాంధీ వస్తడా? రేవంత్ వస్తడా?**
- **సిద్దిపేటలో మీడియాతో హరీశ్‌రావు**

సిద్దిపేట, మే 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తున్నామంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ నిర్మల్ సభలో పట్టపగలే పచ్చి అబద్ధాలు చెప్పారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. గ్యారెంటీల అమలుపై తప్పుదోవ పట్టిచ్చినందుకు రాహుల్‌గాంధీ తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆ తరువాతే ఓట్లు అడగాలని సూచించారు. ఆదివారం ఆయన సిద్దిపేటలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. 'హామీల అమలుపై రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు అబద్ధం ఆడింది కాకుండా, రాహుల్‌గాంధీతో కూడా అబద్ధాలు ఆడిస్తున్నారు. ఇది చాలా తీవ్రమైన విషయం. నిర్మల్ సభలో రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నా. ఏ హామీలు అమలు చేశారో..? ఏ హామీలు అమలు చేయలేదో..? శ్వేతపత్రం విడుదలచేయాలి' అని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్ అయితే, రాహుల్‌గాంధీ అంతకంటే అబద్ధాల కోరు అని రుజువైందని చెప్పారు. ఆయన రాహుల్‌గాంధీ కాదు– రాంగ్‌గాంధీ అని నిరుపించుకున్నారని ఎద్దేవా చేశారు. మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తున్నామని, ఏడాదికి రూ.30 వేలు మహిళల అకౌంట్‌లో వేస్తున్నామని రాహుల్‌గాంధీ అబద్ధం ఆడారు. వేయని డబ్బులు వేస్తున్నామని చెప్పడం అంటే మహిళలను అవమాన పర్చడమే. 'రాష్ట్రంలోని ఏ మహిళ అకౌంట్‌లోనైనా రూ.2,500 జమ అయ్యాయా? ఏడాదికి రూ.30 వేలు వస్తున్నాయా? రాహుల్‌గాంధీకి స్క్రిప్ట్ రాసిచ్చింది ఎవరు? రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నది ఎవరు?' అని ప్రశ్నించారు. 18 ఏండ్లు నిండిన ప్రతి అక్కకు, చెల్లెకు విజ్ఞప్తి చేస్తున్నా.. రాహుల్‌గాంధీ వేస్తున్నామన్న డబ్బులు ఎటుపోయాయి? అవి ఎవరి అకౌంట్‌లో జమ అయ్యాయి? అవి మీ అకౌంట్‌లో ఎందుకు పడలేదో.. మీ దగ్గరికి ప్రచారానికి వస్తున్న ముఖ్యమంత్రి, మంత్రులను, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను నిలదీయాలని పిలుపునిచ్చారు. నాలుగు నెలలకు సంబంధించిన రూ.10 వేలు ఎటు పోయినట్టు? దీనిపై ఎక్కడికక్కడ మహిళలు కాంగ్రెస్ పార్టీ నాయకులను నిలదీయాలని కోరారు. రాహుల్, రేవంత్.. ఇద్దరు తోడు దొంగలు కలిసి అబద్ధాలతో రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

### హామీల అమలు బాధ్యత మీది కాదా?

గ్యారెంటీల అమలు బాధ్యత తమదేని ఎన్నికల ప్రచారంలో రాహుల్‌గాంధీ, సోనియాగాంధీ, ప్రియాంకాగాంధీలు చెప్పలేదా? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి వంద రోజులు దాటినా, 150 రోజులు అవుతున్నా ఆరు గ్యారెంటీలు అమలు కాలేదని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ఆరా తీసి, దానిని సరిదిద్దాల్సింది పోయి రాహుల్‌గాంధీ కూడా దొంగలకు సద్ది కడుతున్నారని విమర్శించారు. 'మీరు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి? ఏ మొఖం పెట్టుకొని తెలంగాణ ఓట్లు అడుగుతున్నారు? హామీలు అమలు చేయకపోతే ఆ బాధ్యత మీది కాదా? అమలు అవుతున్నాయా? లేదా అని రివ్యూ చేయరా? పైగా అన్ని అమలు అవుతున్నాయని పచ్చి అబద్ధాలు ఆడటం ఎంత వరకు కరెక్ట్?' అని ప్రశ్నించారు. గ్యారెంటీలకు గ్యారెంటీలుగా ఉండాల్సిన రాహుల్‌గాంధీ ప్రవర్తన చూస్తుంటే, కంచే చేను మేసిన చందంగా ఉన్నదని దుయ్యబట్టారు.

### బహిరంగ చర్చకు సిద్ధమా?

'రేవంత్‌రెడ్డి ఐదు గ్యారంటీలు అమలయ్యాయని చెప్తుంటే, రాహుల్‌గాంధీ ఆరు గ్యారెంటీలు అమలయ్యాయని అంటున్నారు. నేను మాత్రం ఒక్కటే అయిందని అంటున్నా. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్, లైవ్‌టీవీ డిస్కషన్.. ఎక్కడైనా చర్చకు సిద్ధం? రాహుల్ వస్తాడా? రేవంత్ వస్తాడా? ఎవరు వస్తారో రండి' అని హరీశ్‌రావు సవాల్ విసిరారు. ఎకరానికి రూ.15 వేల చొప్పున ఏ రైతు ఖాతాలో పడ్డాయో చెప్పాలని కాంగ్రెస్ నేతలను నిలదీయాలని రైతులకు పిలుపునిచ్చారు. విద్యార్థులకు ఐదు లక్షల భరోసా కార్డు ఏమైంది? అవ్వాతాతలకు నాలుగు వేల ఫించన్ ఎక్కడ అమలైంది? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అంటేనే కుట్ర, కపట నీతి అని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల విశ్వసనీయతను కోల్పోతున్నదని పేర్కొన్నారు.

## కాంగ్రెస్, బీజేపీ మోసాలతో గుండెలు మండుతున్నాయి

- **కాంగ్రెస్‌కు ఓటేస్తే అబద్ధాలకు ఆమోదం తెలిపినట్టే**
- **కరెంటు కష్టాలు, మంచినీళ్లకు బాధలు.. ఇదేనా మార్పు?**
- **జనంలో తిరుగుబాటు.. ఆ భయంతోనే దేవుళ్లపై రేవంత్ ఒట్లు**
- **రోడ్డుషోలో హరీశ్‌రావు**

రాజన్న సిరిసిల్ల, మే 5 (నమస్తే తెలంగాణ)/భీమదేవరపలి: 'రాష్ట్రంలో ఎండలు మండుతున్నయ్. కాంగ్రెస్, బీజేపీల మోసపూరిత మాటలు వింటుంటే ప్రజల గుండెలు కూడా మండుతున్నయ్. కాంగ్రెసోళ్లు మార్పు.. మార్పు అని చెప్తే ప్రజలు ఆశపడి ఓట్లేసిండ్రు. కానీ, కరెంటు కష్టాలు, మంచినీళ్ల కష్టాలు తెచ్చారు. దవాఖానలకు పోతే ఇబ్బందులు పడే రోజులు తెచ్చారు. కాంగ్రెస్ తెచ్చిన మార్పు ఇదేనా?' అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ ఎన్నికల్లో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, తప్పి కాంగ్రెస్‌కు ఓటేస్తే వాళ్ల అబద్ధాలకు ఆమోదం తెలిపినట్టవుతుందని, వాళ్ల మోసాలకు సద్దికట్టినట్టే అవుతుందని హెచ్చరించారు. హామీలు అమలు చేయకుండా మోసం చేసినా ప్రజలు తనకే ఓటు వేశారని రేవంత్‌రెడ్డి విర్రవీగుతారని చెప్పారు. ప్రభుత్వాల మెడలు వంచి అడగాలంటే బీఆర్ఎస్‌కు ఓటేసి భారీ మెజార్టీతో వినోదన్నను గెలిపించాలని కోరారు. ఆదివారం ఆయన కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌తో కలిసి చందుర్తి మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొన్నారు. భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూరులో రోడ్‌షో నిర్వహించారు. మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డితో కలిసి మెదక్ జిల్లా తూప్రాన్, రామాయంపేట, సిద్దిపేట జిల్లా మిరుదొడ్డిలో నిర్వహించిన రోడ్‌షోల్లో పాల్గొన్నారు. ఆయా సభల్లో హరీశ్‌రావు మాట్లాడుతూ.. నాడు బీడీ కట్టలపై కాంగ్రెస్ పుర్రె గుర్తు పెడితే, బీజేపీ 12% జీఎస్టీ విధించి పరిశ్రమను సంక్షోభంలోకి నెట్టిందని విమర్శించారు. బీడీలు చేసే అక్కాచెల్లెళ్లు ఆలోచించాలని, ఆ రెండు పార్టీల మోసాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ 24 గంటల కరెంటు ఇస్తే, ఇప్పుడు 11 గంటల కరెంటుతో మళ్లీ కాలిపోయే మోటర్లు చాలయ్యాయని చెప్పారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో ఒక్క మోటరు కూడా కాలిపోలేదని తెలిపారు. తిరగబడుతున్న జనాన్ని చూసి, ఎవరు ఓట్లేసేటట్టు లేరనే భయంతో రేవంత్‌రెడ్డి దేవుళ్ల మీద ఒట్టుపెడుతున్నాడని ధ్వజమెత్తారు. దుక్కిదున్నే సమయంలో ఇవ్వాల్సిన రైతుబంధును కల్లాలకు వడ్లు వచ్చినంక ఇవ్వడమేమిటని ఆగ్రహం వ్యక్తంచేశారు. అయిదునెలలైనా రైతుబంధు ఇచ్చేందుకు చేతకాని ఈ దద్దమ్మలకు మనం ఓటెయ్యాల్నా? అని ప్రశ్నించారు. వడ్లకు, మక్కలకు ఇస్తానన్న రూ.500 బోనస్ కూడా ఇవ్వని దిక్కుమాలిన సర్కారని ధ్వజమెత్తారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆదాని, అంబానీలను ప్రపంచ కుబేరులుగా చేసిందని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. కార్పొరేట్ కంపెనీలకు మేలు చేసే పార్టీ, కర్షకులకు అన్యాయం చేసే పార్టీ బీజేపీ అని విమర్శించారు. గ్యాస్, పెట్రోలు, డీజిల్ ధరలు, జీఎస్టీ పేరిట పప్పు, ఉప్పు, నూనెలు, కూరగాయలు అన్నింటి ధరలు పెంచిన బీజేపీకి ఎందుకు ఓటెయ్యాలని నిలదీశారు. మన వికాసం కోసం వినోదన్నను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. వినోదన్న తెలంగాణ ఉద్యమంలో పాల్గొని రాష్ట్ర సాధనలో కేసీఆర్‌కు కుడి భుజంగా పనిచేశాడని చెప్పారు. కొత్తపల్లి, మనోహరాబాద్ రైలు మార్గం, జాతీయ రహదారులు, కరీంనగర్‌కు స్మార్ట్‌సిటీ తెచ్చిన వినోదన్నను దీవించాలని కోరారు. ప్రశ్నించే గొంతును గెలిపిస్తే బల్లగుద్ది అడిగే హక్కు ఉంటుందని చెప్పారు.

### అభివృద్ధి కావాలా? విధ్వంసం కావాలా? : వినోద్‌కుమార్

అభివృద్ధి అంటే బీఆర్ఎస్ అని, విధ్వంసం అంటే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలని, అభివృద్ధి కావాలా? విధ్వంసం కావాలా? ప్రజలు ఆలోచించాలని కరీంనగర్ బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ కోరారు. ఇచ్చిన హామీలను నెరవేర్చమంటే సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్లపై ఒట్లు వేస్తున్నారని ఎద్దేవా చేశారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్నా ఆ పార్టీ ఎంపీ బండి సంజయ్ చేసింది చెప్పలేకనే దేవుళ్ల పేరుతో రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. తాను ఎంపీగా ఉన్న సమయంలో ఎల్కతుర్తి నుంచి సిద్దిపేట వరకు నేషనల్ హైవే కావాలని కేంద్రంపై ఒత్తిడి తెస్తే ఇప్పుడు పనులు జరుగుతున్నాయని గుర్తుచేశారు. అభివృద్ధిని ఆకాంక్షించి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.


**INCOIS**

भारतीय राष्ट्रीय महासागर सूचना सेवा केंद्र,

**Indian National Centre for Ocean Information Services (INCOIS)**

संदर्भ: इंकॉइस: क्रय. 80/2023 — मई 06, 2024

Ref: INCOIS: PUR. 80/2023 — May 06, 2024

इंकॉइस वैबसाइट के विस्तार के लिए रूचि की अभिव्यक्ति

**Expression of Interest (EOI) for 'Augmentation of Website for INCOIS"**

The Indian National Centre for Ocean Information (INCOIS) provides various ocean-related services to a range of stakeholders. INCOIS has Website i.e., web-GIS based, multi-lingual, database driven online information delivery system enables the users to query, analyze, visualize, and download ocean data, information, and advisories for their regions of interest.

INCOIS invites Expression of Interest (EoI) for Augmentation of the functionalities of is Website. Broad scope of work can be downloaded from **www.incois.gov.in** under Tender column from 06th May 2024 . Interested bidders fulfilling the pre-qualification criteria as stated in the request for EoI may participate in this process.

The offers/proposals in the prescribed format shall be submitted in sealed covers superscribed the Reference number and due date to the below address through post or by hand on or before 15:00 Hrs of June 07, 2024

| डाक पता / Postal Address | स्थान पता / Location Address |
| --- | --- |
| Indian National Centre for Ocean Information Services (INCOIS), "Ocean Valley", Pragathi Nagar (BO), Nizampet (SO),Hyderabad-500090 | Indian National Centre for Ocean Information Services (INCOIS), "Ocean Valley", Survey No.342/3, Beside ALEAP, Near Pragathi Nagar, Opp. JNTU-Kukatpally, Hyderabad 500090, Ph.No.040-2388 6000 , Fax No.040-23892910 |

**Purchase and Stores officer, INCOIS**

क्रय एवं भण्डार अधिकारी, इंकॉइस